
నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
13 | హైదరాబాద్, శుక్రవారం 9 ఫిబ్రవరి 2024 | HYDERABAD



## కలెక్టర్ సార్..
# లెక్కల్లో మాస్టార్

బోర్డు మీద లెక్కలు చెప్తున్న ఈ సార్‌ను గుర్తుపట్టారా ? అవును.. కలెక్టర్ సారే. గురువారం బంజారాహిల్స్‌లోని ఎన్‌బీటీ నగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు ఇలా గణితంపై ప్రత్యేక తరగతులు తీసుకున్నారు. ఆయన వెంట జిల్లా విద్యాధికారిని ఆర్ రోహిణి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి యాదయ్య, సికింద్రాబాద్ ఆర్డీవో రవికుమార్, సంబంధిత అధికారులు ఉన్నారు.

**- సిటీబ్యూరో, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ)**



## ఎయిర్‌పోర్టులో
# మెట్రో డిపో!

**శంషాబాద్‌లో రెండో డిపో ఏర్పాటుకు స్థలాన్వేషణ**

**వడివడిగా రెండో దశ మెట్రో డీపీఆర్ రూప కల్పన**

**ట్రాఫిక్ సర్వే, భూసార పరీక్షలు, స్టేషన్ల నిర్మాణం గుర్తింపు పనులు**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ) : మెట్రో రెండో దశ సమగ్ర ప్రాజెక్టు నివేదిక తయారీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 7 మార్గాల్లో 70 కి.మీ మేర నిర్మించాలని ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో హైదరాబాద్ మెట్రో అధికారులు క్షేత్ర స్థాయిలో సర్వే మొదలు పెట్టారు. రెండు కన్సల్టెన్సీ సంస్థలతో వేర్వేరుగా ప్రతిపాదిత మార్గాల్లో ట్రాఫిక్ సర్వేతో పాటు భూ పరీక్షలు, స్టేషన్ల నిర్మాణం, మెట్రో రైళ్ల నిలిపేందుకు అవసరమైన డిపోల స్థలాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. రెండోదశ మెట్రో కీలకమైన మెట్రో కారిడార్‌లో నాగోల్ నుంచి ఎల్బీనగర్ మీదుగా చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు లోపలి వరకు మెట్రో మార్గాన్ని నిర్మించాల్సి ఉంది. దీంతో ఈ మార్గంలోనే ఒక మెట్రో డిపోను నిర్మించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. దానికి అనుగుణంగా స్థల లభ్యతపై మెట్రో అధికారులు జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అధికారులతో సంప్రదింపులు చేయగా, అవసరమైన స్థలాన్ని మెట్రో డిపో కోసం ఇచ్చేందుకు అంగీకరించినట్లు తెలిసింది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మెట్రో రైళ్లను నడపాలంటే కనీసం రెండు మెట్రో డిపోల అవసరం ఉంటుందని మెట్రో అధికారి ఒకరు తెలిపారు. మెట్రో డిపోను ఏర్పాటు చేయాలంటే కనీసం 40-50 ఎకరాల స్థలం అవసరమని, ఆ స్థాయిలో భూముల లభ్యతను ఇతర కారిడార్లలో అన్వేషిస్తున్నామని తెలిపారు. రెండో దశ మెట్రో డీపీఆర్‌ను మరో నెల వ్యవధిలో ప్రభుత్వానికి అందజేసే అవకాశం ఉందని తెలిపారు.



# జ్ఞాన తెలంగాణ నిర్మాణానికి..

**సాధనంగా హైదరాబాద్ బుక్ ఫెయిర్**

**ఎన్టీఆర్ స్టేడియంలో 365 స్టాల్స్‌తో ఏర్పాటు**

**నేడు ప్రారంభించనున్న మంత్రి జూపల్లి కృష్ణారావు**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ) : 36వ హైదరాబాద్ జాతీయ పుస్తకాల ప్రదర్శన ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం నుంచి కొలువుదీరనున్నది. లక్షలాదిగా పుస్తక ప్రేమికులు తరలొచ్చే ఈ బుక్ ఫెయిర్‌లో 365 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్టు హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీ శంకర్ తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పుస్తక ప్రదర్శన సాయంత్రం 5 గంటలకు ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభిస్తారని తెలిపారు. ఆత్మీయ అతిథులుగా సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామ్ అయ్యర్, విశ్రాంత సుప్రీం కోర్టు న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పద్మశ్రీ కూరెళ్ల విఠలాచార్య, తెలంగాణ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, విమలాగద్దర్ పాల్గొంటారని తెలిపారు. జ్ఞాన తెలంగాణ నిర్మాణానికి పుస్తక ప్రదర్శనలను సాధనాలుగా తయారు చేస్తున్నామని తెలిపారు. ప్రతీ రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8:30 గంటల వరకు పుస్తక ప్రదర్శన ఉంటుందని చెప్పారు. శని, ఆదివారాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఈ పుస్తక ప్రదర్శన ప్రాంగణానికి ప్రజాయుద్ధనౌక గద్దర్ పేరును, వేదికకు సంస్కృతం పండితుడు రవ్వా శ్రీహరి పేర్లను నామకరణం చేస్తున్నట్టు చెప్పారు. ద్వారానికి ఉర్దూ దినపత్రిక సియాసత్ మాజీ యండీ జహీరుద్దీన్ అలీఖాన్ పేరు పెడుతున్నట్టు తెలిపారు. పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో తెలంగాణ అమరవీరుల స్మారకస్థూపాన్ని పెడుతున్నామని చెప్పారు. ఓ స్టాల్‌కు ఇటీవల మరణించిన జర్నలిస్టు నర్సింగ్ రావు పేరు నామకరణం చేసినట్టు వివరించారు. బాలప్రపంచం పేరుతో పిల్లలకు పెయింటింగ్, క్విజ్, సంగీతం తదితర పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పిల్లలకు, ఉపాధ్యాయులకు, జర్నలిస్టులకు ఉచిత ప్రవేశం ఉంటుందని చెప్పారు. అనంతరం హెచ్‌బీఎఫ్ కార్యదర్శి ఆర్.వాసు మాట్లాడుతూ.. గతంలో మాదిరిగా నిర్వహణకు సరిపడా బడ్జెట్ లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నారాయణ రెడ్డి, కోయ చంద్రమోహన్, సంయుక్త కార్యదర్శి శోభన్ బాబు, కార్యవర్గ సభ్యులు సూరిబాబు, బాల్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

**ప్రతీరోజు సాయంత్రం 6గంటలకు సాహిత్య కార్యక్రమాలు..!**

- ఫిబ్రవరి 10 -గద్దర్ యాదిలో..
- 11 -బాలసాహిత్యంపై సెమినార్
- 12 - దళిత బహుజన తాత్వికత-పరామర్శ
- 13 - రవ్వా శ్రీహరి రచనలు-విహంగ వీక్షణం
- 14 - నేటి నాగరిక పరిణామం-రచయితల స్పందన
- 15 - సాహిత్య విమర్శకులు సంగిశెట్టి శ్రీనివాసరావుతో ముఖాముఖి
- 16 - యువతరం కవుల అంతరంగ ఆవిష్కరణ
- 17 - కథలోనా పయనం-పెద్దింటి అశోక్ కుమార్ ముఖాముఖి
- 18 - నాటకంలో నా ప్రయాణం-శ్రీనివాస్‌తో ముఖాముఖి
- 19 - పి.శివశంకర్ ఆత్మకథ-అదొక్కటే ఏవగింపుపై చర్చాకార్యక్రమం

> జ్ఞాన తెలంగాణ నిర్మాణానికి పుస్తక ప్రదర్శనలను సాధనాలుగా తయారు చేస్తున్నాం. ప్రతీ రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8:30 గంటల వరకు పుస్తక ప్రదర్శన ఉంటుంది.


ఎన్టీఆర్ స్టేడియంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌బీఎఫ్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్



## హెచ్‌ఎండీఏ ప్లానింగ్‌కు
# బిగుస్తున్న ఉచ్చు

**శివబాలకృష్ణ ఆదేశాల మేరకే పనులు**

**అధికారుల్లో ఏసీబీ విచారణ గుబులు**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ) : ఆదాయానికి మించి ఆస్తుల కేసులో అరెస్టయిన శివ బాలకృష్ణ విచారణ పూర్తయింది. విచారణ సమయంలో ఏసీబీ అధికారులు 4 రోజుల పాటు అమీర్‌పేటలోని స్వర్ణజయంతి కాంప్లెక్సులో ఉన్న హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. కీలకమైన పత్రాలు జిరాక్స్ తీసుకోవడంతో పాటు కొన్నింటినీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకున్నారు. కాగా 4 రోజుల పాటు జరిగిన ఏసీబీ విచారణ, అనుమతుల పత్రాల పరిశీలన తర్వాత హెచ్‌ఎండీఏ ప్రణాళిక విభాగంలో బాలకృష్ణ ఆదేశాలకు అనుగుణంగా పలువురు అధికారులు పనిచేసినట్లు గుర్తించినట్లు సమాచారం. ఇప్పటి వరకు భారీ బహుళ అంతస్తుల భవనాల అనుమతులు, గేటెడ్ కమ్యూనిటీ లేఅవుట్‌లకు ఇచ్చిన అనుమతుల పత్రాలను ఏసీబీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కొన్ని అనుమతుల పత్రాల్లో అప్రోచ్ రోడ్లు నిబంధనలకు అనుగుణంగా లేకపోవడంతో హైరైజ్ భవనాలకు అనుమతులు ఇచ్చారని, అలాంటి ఫైళ్ల ద్వారా కోట్ల రూపాయలు చేతులు మారినట్లు గుర్తించారు. క్షేత్ర స్థాయిలో ప్లానింగ్ ఆఫీసర్‌తో పాటు ఏపీవోలు, జేపీవోలు తనిఖీ చేసి నివేదికను రూపొందించాల్సి ఉన్నా, డైరెక్టర్‌గా ఉన్న బాలకృష్ణ చెప్పినట్లుగా నివేదికలు ఇచ్చినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో హెచ్‌ఎండీఏ డైరెక్టర్ కింద పనిచేసిన కొందరు అధికారులను కూడా ఏసీబీ అధికారులు విచారించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. శివ బాలకృష్ణ విచారణ పూర్తయే వరకు హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగంలోని కొందరు అధికారులు కంటి మీద కునుకు లేకుండా గడపాల్సిన పరిస్థితి నెలకొంది.



## ప్రోటోకాల్ వినతి

మల్కాజిగిరి నియోజకవర్గంలో ప్రభుత్వ అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని, తన నెంబర్ నుంచి బీఆర్‌ఎస్ కార్పొరేటర్లకు ఫోన్ చేసి గుర్తు తెలియని వ్యక్తులు బెదిరిస్తున్నారని గురువారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ స్పీకర్ కార్యాలయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, చిత్రంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తదితరులు

**- మల్కాజిగిరి, ఫిబ్రవరి 8**



### సీపీఆర్‌పై నేటి నుంచి గాంధీలో ఉచిత శిక్షణ

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 8 : కండ్లెదుటే గుండెపోటుకి గురయిన వ్యక్తిని రక్షించేందుకు సికింద్రాబాద్‌లోని గాంధీ మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థులు సీపీఆర్‌పై శిక్షణ ఏర్పాటు చేశారు. కళాశాల అలుమ్ని భవనంలో శుక్ర, శనివారాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచితంగా సీపీఆర్‌పై శిక్షణ, అవగాహన ఇవ్వనున్నామని గాంధీ అలుమ్ని సంఘం అధ్యక్షుడు డాక్టర్ జీఆర్ లింగమూర్తి, కార్యదర్శి డాక్టర్ ఏవీ.రత్నం తెలిపారు.



# ఈవీఎంలు సిద్ధం చేయండి

**అధికారులకు రొనాల్డ్ రాస్ ఆదేశం**

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 8 : రానున్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం) లను సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. గురువారం చాదర్‌ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండ్‌లో ఓటింగ్ యంత్రాల మొదటి దశ పని తీరును పరిశీలించారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించడంలో కీలక భూమిక పోషించే ఈవీఎంల సమర్థతను పూర్తి స్థాయిలో నిర్ధారించాలని అధికారులకు సూచించారు.

## గ్రేటర్ @35.0

సిటీబ్యూరో, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): ఆగ్నేయం దిశ నుంచి తెలంగాణ వైపు వీస్తున్న గాలుల ప్రభావంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతున్నాయి. ఈ క్రమంలో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే 4 డిగ్రీలు పెరిగి 35.0డిగ్రీల సెల్సియస్ గాను, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4.2 డిగ్రీలు పెరిగి 22.2డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 39 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.



# రియల్టర్ దారుణ హత్య



**యువతితో ఫోన్ చేయించి పిలిచి..**

**కత్తులతో పొడిచి.. మర్మాంగాలు కోసి.. హత్యలో పాల్గొన్న రౌడీ షీటర్లు**

బంజారాహిల్స్, ఫిబ్రవరి 8 : అర్ధరాత్రి వేళ యువతితో ఫోన్ చేయించి గదికి పిలిచిన దుండగులు పాతకక్షలతో రియల్టర్‌ను దారుణంగా హత్య చేశారు. కత్తులతో విచక్షణారహితంగా పొడిచి, అతడి మర్మాంగాలను కోసేశారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ సంఘటన జరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ సమీపంలోని సింగోటం గ్రామానికి చెందిన పుట్ట రాము అలియాస్ సింగోటం రామన్న(35) కొంతకాలంగా నాగర్‌కర్నూల్ జిల్లాతో పాటు కుత్బుల్లాపూర్ తదితర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. కుటుంబ సభ్యులు సొంతూర్లో ఉండగా రాము పేట్‌బషీర్‌బాద్ ప్రాంతంలో ఓ విల్లాలో నివాసం ఉంటాడు. కొల్లాపూర్ ప్రాంతంలో అబ్దుల్ కలామ్ ఫౌండేషన్ పేరుతో సామాజిక కార్యక్రమాలు చేస్తున్నాడు. ఇటీవల బీజేపీలో చేరిన రాము రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నిస్తున్నాడని తెలుస్తోంది.

ఇదిలా ఉండగా పదేండ్లుగా మణికంఠ అనే వ్యక్తితో రాముకు వ్యాపార లావాదేవీలతో పాటు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. వారిద్దరూ కలిసి యూసుఫ్‌గూడలోని ఎల్ఎన్‌నగర్‌లో నివాసం ఉండే ఓ మహిళ(45) ఇంటికి వస్తుండేవారు. వీరిద్దరి మధ్య ఆర్థిక వివాదాలు, గొడవలు జరుగడంతో పేటబషీరాబాద్ పీఎస్‌లో కేసులు కూడా నమోదయ్యాయి. దీంతో ఎలాగైనా రామును చంపాలని మణికంఠ ప్రణాళిక వేసుకున్నాడు. బోరబండకు చెందిన ఓ రౌడీషీటర్‌తో పాటు మరికొంతమందిని సిద్ధం చేసుకుని, ఎల్ఎన్‌నగర్‌కు చెందిన మహిళతో రాముకు ఫోన్ చేయించి పిలిపించారు. దీంతో బుధవారం రాత్రి రాము భవనంలోని పెంట్‌హౌజ్‌లో ఉన్న సమయంలో మణికంఠ సహా సుమారు 10మంది దుండగులు లోనికి ప్రవేశించి అత్యంత కిరాతంగా హత్య చేసి పారిపోయారు. స్థానికుల సమాచారంతో అర్ధరాత్రి దాటిన తర్వాత జూబ్లీహిల్స్ పోలీసులు, క్లూస్ టీమ్ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఇదిలా ఉంటే గురువారం ఉదయమే నలుగురు నిందితులు పోలీసులు ఎదుట లొంగిపోయినట్లు తెలుస్తోంది. మిగిలిన నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుల నుంచి సుమారు 10 కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.


పుట్ట రాము అలియాస్ సింగోటం రామన్న (ఫైల్)

### మహిళ పాత్రపై ఆరా..?

ఇదిలా ఉండగా మణికంఠ వేసిన ప్రణాళికలో నేరుగా పాల్గొన్న నిందితులతో పాటు మృతుడిని అక్కడకు పిలిపించిన మహిళ పాత్రపై పోలీసులు విచారణ చేస్తున్నారు. ఎల్ఎన్ నగర్‌లో సుమారు ఆరేండ్లుగా నివాసం ఉంటున్న ఓ మహిళకు చెందిన ఇంటి పెంట్‌హౌజ్‌లో హత్య జరిగింది. దీంతోపాటు హత్యకు ముందు రాముకు వచ్చిన ఫోన్ కాల్స్‌ను పరిశీలించగా ఓ మహిళ నుంచి వచ్చాయని తేలింది. దీంతో హత్యలో సదరు మహిళకు కూడా సంబంధం ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. సదరు మహిళపై గతంలో బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో వ్యభిచారగృహం నడిపించినట్లు కేసులు కూడా నమోదు కావడంతో ఆ కోణంలో కూడా పోలీసుల విచారణ కొనసాగుతోంది. ఫోన్ చేసిన మహిళను సైతం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఏటీయూ ఆటో యూనియన్ నాయకులు

# ఆటో డ్రైవర్లను ఆదుకోండి

**మంత్రి పొన్నం ప్రభాకర్‌కు టీఏటీయూ వినతి**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ) : ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని, అలాగే ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలు నివారించాలని టీఏటీయూ ఆటో యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య ఆధ్వర్యంలో గురువారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఆటో కార్మికుల సమస్యలపై సమగ్రమైన నివేదిక సమర్పించాలని మంత్రి చెప్పినట్టు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్, టీఏటీయూ స్టేట్ ఆర్గనైజర్ దయ్యాల దాసు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు పోలే నిరంజన్, ఉపాధ్యక్షులు చంద్రమౌళి, ఎస్ రామ్, కిషన్, ఉపేందర్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## అనవసరమైనవి..
# రద్దు

**డిప్యూటేషన్లలో లిమిటేషన్లు**

**వైద్య, ఆరోగ్యశాఖలో మారిన మార్గదర్శకాలు**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ) : వైద్య, ఆరోగ్యశాఖలో డిప్యూటేషన్ల రద్దు ప్రక్రియపై సరైన స్పష్టత లేకపోవడంతో అయోమయ పరిస్థితి నెలకొన్నది. రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఉద్యోగులను వెనక్కి పంపాలని బుధవారం వచ్చిన ఆదేశాలకు కొనసాగింపుగా అదే రోజు రాత్రి ఆయా జిల్లా అంతర్గత డిప్యూటేషన్లనూ రద్దు చేయాలని ఆరోగ్యశాఖ నుంచి మరో ఆదేశం వచ్చింది. దీంతో డిప్యూటేషన్లపై గురువారం సాయంత్రం వరకు అయోమయ పరిస్థితి ఉంది. ఇతర జిల్లాల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన వారిని వెనక్కి పంపిస్తే ఎలాంటి నష్టం లేకపోయినా...జిల్లాల్లో అంతర్గత డిప్యూటేషన్‌పై వచ్చిన వారిని వెనక్కి పంపిస్తే ఆరోగ్య కేంద్రాలు మూతపడే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే మల్కాజిగిరి మేడ్చల్ పరిధిలో 10 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బంది మొత్తం డిప్యూటేషన్‌పై వచ్చిన వారే. రంగారెడ్డి జిల్లా పరిధిలో 5 పీహెచ్‌సీలలో ల్యాబ్ టెక్నీషియన్, నర్సింగ్ సిబ్బంది దగ్గర నుంచి డాక్టర్ వరకు అందరూ డిప్యూటేషన్‌పై పని చేస్తున్న వారే. మరో 20 పీహెచ్‌సీలలో 20 మంది వైద్యులు డిప్యూటేషన్‌పైననే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక హైదరాబాద్ జిల్లా పరిధిలో దాదాపు 15నుంచి 23పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పూర్తిగా డిప్యూటేషన్‌పై వచ్చిన సిబ్బందితోనే నడుస్తున్నాయి. అయితే ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లా అంతర్గత డిప్యూటేషన్లను రద్దు చేస్తే చాలా చోట్ల ఆరోగ్య కేంద్రాలకు తాళాలు వేసుకోవాల్సిన పరిస్థితి ఉన్నట్లు అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఎట్టకేలకు డిప్యూటేషన్లపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. జిల్లాల అంతర్గత డిప్యూటేషన్ల విషయంలో అనవసరమైన వారిని మినహా అవసరమున్న సిబ్బందిని కొనసాగించవచ్చని అధికారులకు స్పష్టతనిచ్చినట్లు తెలిసింది.